ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.



విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవితకాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతో పాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

అస్మదీయుల కోసమేనా?

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతో పాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

airtel

ఐదింతలైన

ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ఎన్ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.

ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ.1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

నష్టాల్లో మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడం తోపాటు ఎఫ్ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.

అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

కొత్త బాస్.. కోతకు సై!





నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం

నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు

రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం

ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. మున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

జొమాటో

ఇకపై ఎటర్నల్

పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

టీసీఎస్ ఉద్యోగులకు షాక్

సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత్త పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరు తో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

పీపీలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లకు సీపీ సన్మానం

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: కీలకమైన రెండు వేర్వేరు హత్యల కేసుల్లోని నిందితులు.. నేరం నుంచి తప్పించుకోకుండా పనిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను సీపీ సునీల్‌దత్ గురువారం ఖమ్మంలోని తన కార్యాలయంలో సన్మానించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదించి నిందితులకు శిక్ష పడేలా చేసిన పీపీలను, అందుకు సహకరించిన కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు. సన్మానం పొందిన వారిలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీకృష్ణమోహన్, ముదిగొండ, తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు ఆదినారాయణ, భద్రాజీ, హోంగార్డు యూసుఫ్ ఉన్నారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వీరు సమయస్ఫూర్తితోనూ, చిత్తశుద్ధితోనూ విధులు నిర్వహించడం వల్లనే ఓ మహిళ హత్య కేసులో ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తేజావత్ ఉపేందర్‌నాయక్ (హతురాలి భర్త), అతడి తల్లి పద్మ (హతురాలి అత్త)కు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయూర్తి కే.రాజగోపాల్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు చెప్పారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం చంద్రుతండాలో భూమి తగాదాలు, పాతకక్షల నేపథ్యంలో మద్యంలో విషం కలిపి ముగ్గురిని హత్య చేసిన కేసులో అదే మండలంలోని చంద్రుతండాకు చెందిన బోడ చిన్నాకు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం మూడో అదనపు సెషన్స్ కోర్టు జడ్జీ డీ.రాంప్రసాద్‌రావు మంగళవారం తీర్పు వెలువరించినట్లు చెప్పారు. నిందితులు కేసుల నుంచి తప్పించుకోకుండా భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని సీపీ ఆకాంక్షించారు. ట్రైనీ ఐపీఎస్ రుత్విక్ సాయి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ మురళి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ జగదీశ్ పాల్గొన్నారు.

పీపీలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్

మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలి

మహిళల ఫుట్‌బాల్ పోటీల విజేతల అభినందనలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు సీఎం కప్‌ను గెలుచుకోవడం, ఖేలో ఇండియాస్థాయిలో అండర్ 13, 15, 17 విభాగాల్లో రన్నర్స్‌గా నిలవడం అభినందనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలైన వీవీ పాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్ముందు మరిన్ని మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దుతున్న కోచ్ మాధురిని ప్రశంసించారు. కోచ్ ఆదర్శ్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యాన శాఖ అధికారులు

రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించిన గార్డెనింగ్ ఫెస్టివల్‌లో ఖమ్మం కలెక్టరేట్ ఉత్తమ గార్డెనింగ్ అవార్డును అందుకున్న సందర్భంగా ఆ శాఖ అధికారులు గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలిశారు. ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ అభినందించారు. సెరీకల్చర్ డీడీ ముత్యాలరావు, ఉద్యన సాంకేతిక అధికారులు అనితశ్రీ, అపర్ణ పాల్గొన్నారు.

సఖీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న సఖి కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం సందర్శించారు. ఈ కేంద్రంలో మహిళలకు అందిస్తున్న సేవల గురించి సఖీ కేంద్రం ప్రత్యేక అధికారి రోజారాణి.. కలెక్టర్‌కు వివరించారు. సెక్యూర్ సంస్థ ప్రతినిధి వెంకటకృష్ణ, అడ్మిన్ సరిత, లీగల్ కౌన్సెలర్లు శ్రీదేవి, స్వరూప, అరుణ, అంజని, పుష్పలత పాల్గొన్నారు.

ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభించిన కలెక్టర్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని సార్వజనీన ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన అసంక్రమిత వ్యాధుల చికిత్స కేంద్రం (ఎన్‌సీడీ క్లినిక్)ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని ముందుగానే గుర్తించి చికిత్స అందజేయాలని సూచించారు. అనంతరం ఫిజియోథెరఫీ, క్యాన్సర్ బాధిత సేవా కేంద్రాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు కళావతీబాయి, కిరణ్, సైదులు, రాంబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సఖీ కేంద్రం వద్ద సిబ్బందితో కలెక్టర్

ప్రాక్టికల్స్ ల్యాబుల్లోకి సీసీ కెమెరాలు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 6: జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా సంబంధిత ల్యాబుల్లో గురువారం సీసీ కెమెరాలను అమర్చారు. ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న క్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ప్రాక్టికల్స్ జరిగే ల్యాబుల్లోనే ఉండాల్సిన సీసీ కెమెరాలను చాలా కాలేజీలు తమ కళాశాల కారిడార్ బయట ఏర్పాటుచేశాయి. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ' ఇటీవల ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఇంటర్ విద్యాశాఖ అధికారులు.. ఇంటర్ బోర్డు నిధులతో సీసీ కెమెరాలను తెప్పించారు. జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో అమర్చేలా డీఐఈవో రవిబాబు చర్యలు తీసుకున్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని కళాశాలల ల్యాబ్‌లోని సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసినట్లు డీఐఈవో రవిబాబు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

కాలేజీ ల్యాబుల్లో సీసీ కెమెరాలను అమర్చుతున్న టెక్నీషియన్లు

ఖమ్మం కమ్మ మహాజన సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కొల్లు రఘు, చావా రాము





కొల్లు రఘు, చావా రాము

రఘునాథపాలెం/ ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 6: ఖమ్మం కమ్మ మహాజన సంఘం కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 4న జరగగా ఒక్కో స్థానానికి ఒక నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో సంఘం ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నల్లమల నవీన్ చైతన్య, సహాయ ఎన్నికల అధికారి మేదరమెట్ల సుబ్బయ్య గురువారం ప్రకటించారు. ఖమ్మం కమ్మ మహాజన సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కొల్లు రఘు, చావా రాము, ఉపాధ్యక్షురాలిగా కర్నాటి రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారిగా తుళ్లూరు నిర్మలా కుమారి, కార్యవర్గ సభ్యులుగా మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపారాణి, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వరరావు, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్‌కుమార్ తదితరులు నియమితులయ్యారు.

టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ లేఖ

సిద్ధం చేస్తున్న విద్యాశాఖ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 6: 'విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి. మీ పిల్లలు పరీక్షలు మంచిగా రాసేందుకు తల్లిదండ్రులుగా మీరు కృషిచేయాలి. సెల్‌ఫోన్, టీవీ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను దూరంగా ఉంచుతూ వారు చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి. ప్రభుత్వపరంగా అదనపు తరగతులు, స్పెషల్ టెస్టులు, స్నాక్స్ వంటివి అందిస్తున్నాం. ఆరోగ్యంగా ఉండాలని సూచిస్తూ పలు జాగ్రత్తలు చెబుతున్నాం.' అంటూ టెన్త్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లేఖ రాస్తున్నారు. ఆ లేఖలో పేర్కొనాల్సిన తన మాటలను ఒకటి రెండు రోజుల క్రితమే విద్యాశాఖాధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులు లేఖలను సిద్ధం చేస్తున్నారు. ముద్రించిన ఈ లేఖలను ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 10 వేల మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరో ఒకటి రెండు రోజుల్లో అందించనున్నారు. వీరితోపాటు ప్రధానోపాధ్యాయులకు, టీచర్లకు కూడా ఆ లేఖలను సాఫ్ట్‌కాపీ రూపంలో అందించనున్నారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించనున్నారు. 'పదో తరగతి పరీక్షలు - సన్నద్ధత, విద్యాశాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు' వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జడ్పీ సీఈవో దీక్షారైనా హాజరుకానున్నారు. స్పెషల్ టెస్టుల్లో విద్యార్థుల ప్రగతి సహా పూర్తి వివరాలతో హాజరుకావాలని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు సూచించారు.

10 నుంచి దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు: కలెక్టర్, డీడబ్ల్యూవో

మామిళ్లగూడెం/ ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 6:ఈ నెల 10 నుంచి 14 వరకు జిల్లాలోని దివ్యాంగులకు ఉపకణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో) కే.రాంగోపాల్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అలీమాకో సంస్థ సహకారంతో వినికిడి యంత్రాలు, చార్జింగ్ బ్యాటరీలు, ట్రైసైకిల్, కాలిపర్స్, కృత్రిమ కాళ్లు అందజేయనున్నట్లు వివరించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని అన్నారు. ఈ నెల 10న ఖమ్మంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో , 11న సత్తుపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో, 12న మధిర రైతువేదికలో, 13న వైరా రైతువేదికలో, 14న కూసుమంచి రైతువేదికలో ఈ శిబిరాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు, వృద్ధులు తమ ఆదాయ, సదరం ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను వెంట తీసుకురావాలని సూచించారు.

'యూపీఎస్‌పై యుద్ధభేరి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయబోతున్న యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 2న 'యూపీఎస్‌పై యుద్ధభేరి' పేరుతో మహాధర్నా నిర్వహించబోతున్నట్లు సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పలు స్కూళ్లలో గురువారం జరిగిన కార్యక్రమాల్లో సంఘం నాయకులతో కలిసి 'యుద్ధభేరి' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరితే యూపీఎస్ విధానాన్ని తేవడం దారుణమని అన్నారు. సంఘం నాయకులు చర్ల శ్రీనివాసరావు, రాగి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థాల జాతరకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

– ఆర్డీవో నర్సింహారావు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 6: ఈనెల 26వ తేదీన తీర్థాల గ్రామంలోని సంగమేశ్వర స్వామి జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు అన్నారు. గురువారం మండలంలోని తీర్థాలలోని సంగమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో జాతరకు సంబంధించి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. జాతరకు వచ్చే అన్ని ప్రధాన రహదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, గుంతలు ఉన్నట్లైతే పూడ్చాలన్నారు. జాతరలో మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తుల అవసరాలకు తాగునీరు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పుణ్య స్నానాలను సరిపడ నీటి నిల్వలు ఉండాలని, వైద్యారోగ్యశాఖ శిబిరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరోమారు జాతరకు సంబంధించి సమీక్షా సమావేశం ఉంటుందని, అలోపు ఏర్పాట్ల పురోగతి ఉండాలని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ పీ రాంప్రసాద్, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం రాజు, ఎంపీవో శ్రీదేవి, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్, పోలీస్, పంచాయతీరాజ్, మత్స్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు